హరితహారానికి సన్నద్ధం!

మొక్కలు పెంచుడే లక్ష్యంగా ప్రభుత్వ కార్యాచరణ

- తొమ్మిదో విడతకు మూడు లక్షల మొక్కలు పెంచడమే లక్ష్యం
- టెండర్లు ఖరారు చేసిన అధికారులు
- కన్వర్షన్ చేసిన మరో మూడు లక్షల మొక్కలు



నర్సరీలో పెంచుతున్న హరితహారం మొక్కలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరాన్ని మరింత పచ్చ లహారంగా మార్చేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రతి ఏటా లక్షల మొక్కలు నాటుతూనే.. నిత్యం అవసరమైన చోట ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మొక్కల పెంపకం, నాటడం వంటి వాటిపై దృష్టి సారిస్తున్నారు. వచ్చే హరితహారం కార్యక్రమంలో నాటేందుకు అవసరమైన మొక్కలను పెంచేందుకు కేఎంసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో నర్సరీల్లో మిగిలిన మొక్కలను ఈ ఏడాది నిర్వహించే హరితహారంలో నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

3 లక్షల మొక్కలు.. రూ.40 లక్షల ఖర్చు..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హరితహారం కింద నాటేందుకు అవసరమైన మొక్కలను పెంచేందుకు అధికారులు టెండర్ల ద్వారా ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 9వ విడత హరితహారంలో నాటేందుకు 5,84,540 మొక్కలు అవసరం పడతాయని అధికారులు అంచనా వేశారు. అయితే గతేడాది కేఎంసీ నర్సరీల్లో పెంచిన మొక్కల్లో సుమారు 3 లక్షల వరకు మొక్కలు ఉండడంతో వాటిని ఈ ఏడాదిలో నాటేందుకు కన్వర్షన్ చేసుకుంటున్నారు. ఇక మరో మూడు లక్షల మొక్కలు వచ్చే హరితహారం నాటికి అందించేందుకు రూ.40 లక్షల ఖర్చుతో కేఎంసీ పరిధిలోని 26 నర్సరీల్లో పెంచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పూల మొక్కలకే మొగ్గు..

నగరంలో 8 విడతల హరితహారంలో అనేక రకాల మొక్కలను అధికారులు నాటించారు. పార్కులు, పట్టణ ప్రకృతి వనాలు, ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న డివైడర్లు, ప్రభుత్వ కార్యాలయాల ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట పెద్ద మొక్కలతో పాటు ఇతర పూల మొక్కలు, పండ్ల మొక్కలు నాటించారు. ఈ ఏడు నగరంలో అత్యధికంగా పూల మొక్కలు నాటేందుకు అధికారులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీనిలో భాగంగానే కొత్తగా పెంచే మూడు లక్షల మొక్కల్లో 70 శాతం మొక్కలు పూల మొక్కలు ఉండేలా దిశానిర్దేశం చేశారు. పూల మొక్కలు నాటడం ద్వారా ఇటు పచ్చదనంతో పాటు అటు నగరం అందంగా, ఆహ్లాదకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

నిరంతర ప్రక్రియగా మారింది..

నగరంలో మొక్కలు నాటే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోంది. హరితహారం సమయంలో నగరాన్ని పచ్చనిహారంగా మార్చేందుకు పూలు, పండ్లు, ఇతర మొక్కలను నాటిస్తున్నాం. ఇక ఏడాది పొడవునా అవసరమైన ప్రాంతాల్లో మొక్కలను నాటిస్తున్నాం.

– బి.మల్లీశ్వరి, అసిస్టెంట్ కమిషనర్, కేఎంసీ

టెండర్లు ఖరారు చేశాం..

హరితహారానికి అవసరమైన మొక్కలను పెంచేందుకు కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించాం. ఈ ఏడాది మూడు లక్షల మొక్కలను పెంచేందుకు టెండర్లు ఖరారు చేశాం. మరో వారం రోజుల్లో మట్టితో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు ప్రారంభంకానున్నాయి. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేలా చూస్తాం.

– నవ్యజ్యోతి, డీఈ, కేఎంసీ

పేదలకు చేరువలో వైద్యవిద్య



మాట్లాడుతున్న మేయర్ నీరజ, పక్కన మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత తదితరులు

ఖమ్మం వైరారోడ్: వైద్యవిద్యను జిల్లా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చి పేదల కలను ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సాకారం చేశారని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. నగరంలోని వీడీఓస్ కాలనీలో మంత్రి పువ్వాడ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మేయర్ నీరజ మాట్లాడారు. జిల్లాకు మెడికల్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేయగా, నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి కూడా లభించిందని తెలిపారు. వైద్యరంగంపై అనుభవం ఉన్న మంత్రి పువ్వాడ ఈ విషయంలో విశేష కృషి చేశారని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ విజయ్, మార్కెట్ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, కమర్తపు మురళితో పాటు రాపర్తి శరత్, ఆశ్రిఫ్, కొల్లు పద్మ, షకీనా, షంషుద్దీన్, తాజుద్దీన్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ..

ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఖమ్మం నగరంలోని గాంధీచౌక్ సెంటర్‌లో శ్రీ వరప్రధాత షిరిడీ సాయిబాబా మందిరం చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడు కూడా నెల రోజుల పాటు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు, సాయిబాబా మందిరం కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, జగన్, ప్రసాద్, సూర్యనారాయణ, శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: విజయ డైరీ పాల సేకరణ ధరలు పెంచినట్లు తెలిపే పోస్టర్లను కలెక్టర్ వీపీ గౌతమ్ బుధవారం ఐడీఓసీలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఉత్పత్తి వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో పాడి రైతుల విజ్ఞప్తి మేరకు గేదె పాలు లీటరు ధర రూ.73 నుంచి రూ.80 వరకు, ఆవు పాల ధర రూ.37.20 నుంచి రూ.42 వరకు పెంచారన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ జీఎం ఇ.మల్లయ్య, డీడీ డా.కుమారస్వామి, ఎస్‌సీడీఆర్ మనోజ్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ హెచ్‌ఓడీ రాజ్‌కుమార్, మేనేజర్ సిద్దేశ్వర్, జూనియర్ మేనేజర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వైఎస్సార్‌టీపీ నేతలు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న గడిపల్లి కవిత

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు టీ–సేవ్ కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం వైఎస్సార్‌టీపీ నాయకులు నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు గడిపల్లి కవిత, వైఎస్సార్‌టీపీ నాయకుడు నంద్యాల రవీందర్ రెడ్డి, వైరా, ఖమ్మం కో ఆర్డినేటర్లు రాములునాయక్, తుంపాల కృష్ణమోహన్, స్టేట్ యూత్ కో ఆర్డినేటర్ నంబూరి ఓంకార్ కార్తీక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసు నమోదు

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం గ్రామానికి చెందిన పోలంపల్లి రాశి అనే వివాహితను ఆమె భర్త లక్ష్మీనారాయణ అదనపు కట్నం తేవాలంటూ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడంటూ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారికి 2018 లో వివాహం కాగా వివాహ సమయంలో రూ.3లక్షల నగదు, నాలుగు తులాల బంగారం కట్నంగా రాశి తల్లిదండ్రులు ఇచ్చినా అదనపు కట్నం కావాలని ఇబ్బందులు గురిచేస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంతకాల సేకరణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్‌ను పునఃప్రారంభించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి సీవై.పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు చర్యలు తీసుకోవాలని బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి బస్టాండ్‌ను మూత వేశారని, దీనివల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్‌ను పునఃప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పగిడికత్తుల రామదాసు, చిర్రా భిక్షం, పగిడికత్తుల నాగేశ్వరరావు, సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్, వీరబాబు, ఎస్.రమేష్, బార్గవ్, పీఓడబ్ల్యూ నాయకురాలు షకీలా, లక్కం సైదమ్మ, అలేఖ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సాయం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న షేక్ హైమద్ పాషా తండ్రి ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థిక సాయం చేయాలని తలంచి సేకరించిన రూ.10వేలను బుధవారం విద్యార్థి తల్లికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోదులబండలో ఉచిత వైద్య శిబిరం



బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎస్సై స్రవంతి

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండలో బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా.. శిబిరాన్ని నేలకొండపల్లి ఎస్సై జి.స్రవంతి ప్రారంభించారు. వివిధ జబ్బులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం బీజేపీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరక్ష ఆస్పత్రి వైద్యులు సాయికృష్ణ, జీ.వీ, బీజేవైఎం మండల అధ్యక్షుడు మర్రి శివ, మైనార్టీ మండల అధ్యక్షుడు మోహినీద్దీన్, చల్లా మహేష్, ఉదయ్, ఎం.శ్రీనివాస్‌చారి, బాలు పాల్గొన్నారు.

మంచిర్యాల సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం/నేలకొండపల్లి: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై వేసిన లోక్‌సభలో అనర్హత వేటు వేయడాన్ని వ్యతిరేకంగానే కాక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈనెల 14వ తేదీన మంచిర్యాలలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ సంపదను కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతుండడాన్ని ప్రశ్నించినందుకే బీజేపీ నేతలు రాహుల్‌పై కక్ష కట్టారని తెలిపారు. ఈమేరకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రలో భాగంగా మంచిర్యాలలో నిర్వహిస్తున్న సభలో జిల్లా నుంచి తరలిరావాలని రఘునాథపాలెం మండలం కోయచెలకలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు మహ్మద్ జావెద్, నేలకొండపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు కోరారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు రాయల నాగేశ్వరరావు, రాపోలు జయప్రకాష్, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, యడ్లపల్లి సంతోష్, సయ్యద్ ముజాహిద్, మొక్కా శేఖర్‌గౌడ్, మలీదు వెంకటేశ్వర్లు, జెర్రిపోతుల అంజిని, భూక్యా బాలాజీ, కొంటిముక్కల నాగేశ్వరరావు, పాలకుర్తి నాగేశ్వరరావు, ఏలూరి రవికుమార్, రేగూరి హనుమంతరావు, దోసపాటి శేఖర్, బోయిన వేణు, యాతాకుల శ్రీనాథ్, సూరేపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ అక్రమాలను నిలదీయాలి



మాట్లాడుతున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

కామేపల్లి(కారేపల్లి): దేశ సంపదను బడా కంపెనీలకు, అదానీలకు అప్పనంగా దోచిపెడుతున్న ప్రధాని మోదీని ప్రజలు నిలదీయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాతలింగాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీకి బుద్ధి చెప్పేందుకు.. రాహుల్‌గాంధీకి అండగా ఉండేందుకు ఈ నెల 14న మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యనారాయణ, ఎంపీటీసీ రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నాయకులు జి.రాంబాబు, ముక్తి సాంబశివరావు, వి.సైదులు, పాల్గొన్నారు.

'తమ్మినేని' నివాళి

రఘునాథపాలెం: మండల పరిధిలోని కామంచికల్లు గ్రామంలో ఇటీవల మృతిచెందిన గ్రామ మాజీ సర్పంచ్ తొండల సత్యనారాయణ మాతృమూర్తి రాములమ్మ దశదిన కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరై చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. అదేవిధంగా ఇటీవల మరణించిన అదే గ్రామానికి చెందిన వ్యాసాలకు సైదమ్మ కుటుంబాన్ని తమ్మినేని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్, రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి, సీపీఎం నాయకులు అంబడిపూడి సుధాకర్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, గండు లక్ష్మీనారాయణ, అనంతనేనీ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ ఉమ

ఖమ్మంరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులర్ చేసి ఆదుకోవాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు మోర శ్రీనివాస్ తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొబేషనరీ కాలం ముగిసినందున వెంటనే రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమా, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఈఓపీఆర్‌డీ శ్రీనివాస్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో కుక్కల సామేల్ ఆధ్వర్యాన పాస్కు, పులియని రొట్టెల పండుగ సందర్భంగా నిరుపేద క్రైస్తవులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య, రైతు సమన్వయ సమితి మండల డైరెక్టర్ మారగాని పద్మారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.శ్రీనివాసరావుతో పాటు మాదాసు ఆదాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ విశ్రాంత ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖలో 1974 నుంచి ఇప్పటి వరకు చనిపోయిన 80 మంది ఉపాధ్యాయులకు జి.మాధవరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఆర్.శ్రీరామ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమశాఖలో జరుగుతున్న విద్యాభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీలు పార్థసారథి, వసంతరావు, మాజీ సూపరింటెండెంట్ కామేష్‌రావు, ఎస్‌డీ జీయావుద్దిన్, రాజు, సీతారాములు, ఎస్.పూర్ణచందర్‌రావు, భీముడు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి రూ.లక్ష విలువైన మందులు వితరణ



మందులు అందజేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

కూసుమంచి: కూసుమంచిలోని పీహెచ్‌సీకి బీజేపీ జిల్లా కార్యదర్శి బాణోత్ హట్యా నాయక్ చొరవతో బుధవారం సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన మందులను అందజేశారు. ఈ మందులను పేదలకు అందించాలని ట్రస్ట్ బాధ్యులు ఆర్.శ్రీనివాసన్ తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బాధ్యులను పీహెచ్‌సీ సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పైలాన్‌రావు, శ్రీనివాసరావుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోల్‌తండాలో 'కంటి వెలుగు' శిబిరం

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండాలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని మండల ఎంపీపీ మంగీలాల్ జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీఓ జయరాం పీహెచ్‌సీ వైద్యుడు రామారావు, సర్పంచ్ బోడ రంగా, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సైపుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి వర్ధంతి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఐఎంఏ హాల్‌లో జార్జిరెడ్డి 51వ వర్ధంతి సభను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తొలుత జిల్లా కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జార్జిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల అశోక్ మాట్లాడుతూ.. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడటమే జార్జిరెడ్డికి ఇచ్చే అసలైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు దీపిక, లక్ష్మణ్, ఉష, నాయకులు సతీష్, కరుణ్, సింధు, శ్రీకాంత్, సాయి, గణేష్, తరుణ్, రాకేష్, రవి పాల్గొన్నారు.

ఆలయ కమిటీకి మరో ఆరు నెలలు అవకాశం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవాలయం పునరుద్ధరణ కమిటీకి మరో ఆరు నెలల పాటు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమీషనర్ వి.అనిల్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో దేవాలయ కమిటీ చైర్మన్ బచ్చు మురళీకృష్ణ, గోదుమలు శ్రీనివాస్‌రావు, చల్లా సత్యనారాయణ, ఆకుల మల్లికార్జున రావు, గారినె రవికుమార్, గండమళ్ల సంగయ్య, పులిపాటి సంపత్‌కుమార్, మిట్టపల్లి శ్రీనివాస్‌రావు, పిల్లుట మంజుల, రంగరాజు ఊర్మిలను దేవాలయ పునరుద్ధరణ కమిటీలో నియమించినట్లు పేర్కొన్నారు. ఉత్తర్వుల ప్రతులను జిల్లా కలెక్టర్‌తో పాటు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ అసిస్టెంట్ కమిషనర్‌కు పంపించారు.

పథకం ప్రకారమే మైనార్టీలపై దాడులు

ఖమ్మం మామిళ్లగూడెం: పథకం ప్రకారమే మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని తంజీఇన్సాఫ్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ సలాం అన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని శోభాయాత్రల పేరుతో యూపీ, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల్లో 144 సెక్షన్ కొనసాగుతుందని తెలిపారు. మసీదుల్లో ఇఫ్తార్ దావత్ పేరుతో టోపీలు తగిలించుకొని ఫొటోలు దిగుతారే కాని దాడులపై ఏ ఒక్కరు మాట్లాడే పరిస్థితిలో లేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మైనార్టీలకు ఒరిగిందేమిలేదన్నారు. ఈ సమావేశంలో ఎండీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం గట్టయ్య సెంటర్ 53 డివిజన్‌లో డీఎస్ చారిటబుల్ ట్రస్ట్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దనియాకుల వెంకటనారాయణ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం 7వ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్లో అప్ బ్యూటీ పార్లర్ అధినేత హరి చలివేంద్రానికి తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు డాక్టర్ అన్నం శ్రీనివాస్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దొడ్డా అరుణ, మంద సరస్వతి, బీజేపీ నాయకులు సుధాకర్, సాయిరాం, శంకర్, పాపారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కేఎండీసీ'లో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మం సహకారనగర్: నగరంలోని కవిత మెమోరియాల్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎస్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ప్లేట్‌లెట్ పెరగడంతో పాటు రక్తం శుద్ధి చేయబడుతుందని పేర్కొన్నారు. అంతేకాక పలువురిని రక్తదానం చేసేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసరావులు మాట్లాడారు. సుమారుగా 80 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాలు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారావు, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్(జీసీజీటీఏ) నూతన కమిటీని బుధవారం ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.గోపి, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.రవికుమార్‌లు తెలిపారు. రెండేళ్ల పాటు కొనసాగనున్న ఈ కమిటీ కళాశాల యూనిట్ అధ్యక్షుడిగా ఎం.రవీంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీగా సీహెచ్.శ్రీనివాసులు, మహిళా కార్యదర్శి అండ్ ట్రెజరర్‌గా పి.అనురాధ, ఉపాధ్యక్షులిగా పి.రవికుమార్, ఈసీ సభ్యులుగా బి.వీరబ్రహ్మం, ఎస్.మాబు తదితరులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవరావు, మురళీధర్ తదితరులు పాల్గొనగా... ఎన్నికల అధికారిగా తెలుగు విభాగాధిపతి డాక్టర్ జె.రమేష్ వ్యవహరించారు.

ముగిసిన శిక్షణ..

నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ, టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జావా వెబ్‌సైట్ డెవలప్‌మెంట్ శిక్షణ బుధవారంతో ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు.

'కిట్స్'లో ప్రాంగణ నియామకాలు

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్లో గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఎడుజిన్ టెక్నాలజీ కంపెనీ వారు ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ..ప్రాంగణ నియామకాల్లో 28 మంది విద్యార్థులు ఏడాదికి రూ.4లక్షల వేతనంతో నియమితులైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ హెచ్ఆర్ నీరజ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలని వినతి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులు దగాకు గురికాకుండా చూస్తూనే సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ప్రతినిధులు కోరారు. ఈమేరకు బుధవారం మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేతకు వినతిపత్రం అందించారు. అనంతరం రైతుసంఘాలు, వ్యాపార ప్రతినిధులు, మార్కెట్ కమిటీ బాధ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం కమీషన్ల అమలు జరగటం లేదని, రైతుల నుంచి వ్యాపారులు ఇష్టారీతిన కమీషన్లు వసూలు చేయడమే కాక ఖాళీ బస్తాలకు పైకం చెల్లించటం లేదని తెలిపారు. కోల్డ్ స్టోరేజీల్లోనూ రైతుల పంటకు ప్రాధాన్యత లేదని చెప్పారు. ఇవేకాక మార్కెట్‌లో భోజనశాల లేదని, విశ్రాంతి భవనం లేదని పేర్కొన్నారు. ఇకనైనా వ్యాపారులు నిబంధనలు పాటించేలా చూడడంతో పాటు మార్కెట్‌లో బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజాపంథా, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల అశోక్ పాల్గొన్నారు.

రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



ఖమ్మం టూటౌన్‌లో ఫిర్యాదు చేస్తున్న రాందాస్ నాయక్

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంఅర్బన్/ ఖమ్మంమామిళ్లగూడెం/ నేలకొండపల్లి/ కామేపల్లి(కారేపల్లి)ఖమ్మంక్రైం/ఖమ్మం వైరారోడ్: వైరా నియోజకవర్గంలోని కారేపల్లి మండలం చీమలపాడులో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో జరిగిన సంఘటన బాధాకరమని, ఒక్కో బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ, టీడీపీ, అఖిల భారత బంజారా సేవా సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీమలపాడులో విచ్చలవిడిగా బాణాసంచా పేల్చటంతో నిప్పురవ్వలు ఎగిసి పూరిగుడిసెపై పడి అందులోని గ్యాస్ సిలిండర్ పేలి పలువురికి తీవ్ర గాయాలు కావటంతో మరణాలు సంభవించాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుర్ర ఉపేంద్రసాహూ, పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబానికి ఒకరి చొప్పున ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో చీమలపాడు క్షతగాత్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పలు పార్టీల నాయకులు జిల్లా ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగడంతో పోలీసులు పలువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కాగా, మాజీ కేంద్రమంత్రి రేణుకా చౌదరి, అఖిల భారత బంజారా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్కి నాయక్, జిల్లా టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ తన సంతాపాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిదంగా అనుమతి లేకుండా బాణసంచా కాల్చిన వారిపె చర్యలు తీసుకోవాలని ఖమ్మంటూటౌన్‌లో మాలోత్ రాందాస్ నాయక్ ఫిర్యాదు చేశాడు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంగల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రప్రదీప్, మంద సరస్వతి, విజయరెడ్డి, రాజేష్‌గుప్త, నెల్లూరి కోటేశ్వరావు, బీపీనాయక్, అంజయ్య, అరుణ, కార్తీక్, సాయిరాం, రమేష్, శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శులు రాంబాబు,ఉపేందర్,శ్రీనివాస్‌గౌడ్,సుభాష్ చంద్రబోస్, రజిని,మంజుల,అనిత తదితరులు పాల్గొన్నారు.